# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 30 మే 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 312

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD






2లో

## కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం

- నేను జైల్లో ఉన్నప్పుడు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు
- అప్పుడే బలంగా వ్యతిరేకించా
- మరి ఇప్పుడెందుకు అంత బలహీనత?
- పార్టీ బలోపేతం కోసం నేను రాసిన లేఖను లీక్ చేసిందెవరు?
- నన్ను మాటలంటున్న నాయకులు.. కేసీఆర్ నీడలో పనిచేశారే తప్ప వ్యక్తిగతంగా చేసిందేముంది?
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

భారాసను.. భాజపాకు అప్పగించే కుట్ర
"తెలంగాణ వనరులను దోచుకునే ప్రయత్నం చేస్తున్న భాజపాను కట్టడి చేయకుండా.. గంపగుత్తగా భారాసను ఆ పార్టీకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని నా భావన.

# పాక్‌తో యుద్ధం అర్ధాంతరంగా ఎందుకు ఆపారు

మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తడికిఎందుకు తలొగ్గారు
- యుద్ధం ఆపితే అఖిలపక్షానికి ఎందుకు చెప్పలేదు
- గుండెధైర్యం ఉన్నవారే యుద్ధాన్ని గెలిపిస్తారు
- ఇందిరాగాంధీ పాక్‌పై అలాగే గెలిచారు
- జైహింద్ ర్యాలీలో సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

2లో

## 2న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ

**ఖమ్మం:**జూన్2 న భూమి లేని నిరుపేద రైతులు ఎవరైతే అసైన్డ్ భూములను సేద్యం చేస్తున్నారో వారికి పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అధికారులతో జరిగిన సమావేశంలో పొంగులేటి కీలక సూచనలు చేశారు. ధరణిలో ఏర్పడ్డ ఇబ్బందులు మళ్ళీ రిపీట్ కావద్దని, ఎట్టి పరిస్థితుల్లో పొరపాట్లు- జరగొద్దని తెలిపారు. చిన్న చిన్న భూముల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సరదాల కోసం ఉద్యోగాలు చేయొద్దని స్పష్టం చేశారు. ఇది పేదల ప్రభుత్వం, అలసత్వం వహిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని సూచించారు. ఫారెస్ట్ అధికారులు సంయమనం పాటించాలని తెలిపారు. గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు, ఒక్క కొత్త చెట్టు- కూడా నరక నివ్వొద్దని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇదే అదును చూసుకొని అటవీ అధికారులు చాలా ఇబ్బందులు గురిచేస్తున్నారని.. ఇక నుంచి పోడు సాగుగూర్చి బానర్ ఐటమ్ కథనాలు రావొద్దన్నారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం చాలా క్లియర్ గా ఉందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారం ఉన్నా రాష్ట్రాలలో కూడా ఇంటికి 5 లక్షలు ఇవ్వడం లేదని..



పేదవాడికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, పైరవీలు చేయొద్దని తెలిపారు. ఒకటికి పది సార్లు చెప్తున్న అనర్హులకు కాకుండా ఇల్లు ఇస్తే సస్పెండ్ కాదు, అంతకన్నా పెద్ద శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఒక్క రూపాయి లంచం తీసుకున్న సహించేది లేది... ఇందిరమ్మ ఇళ్ల ముసుగు లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసుకోవాలన్నారు. నియోజక వర్గానికి 3500 ఇల్లు కాకుండా ఐటిడిఏ పరిధిలో ఇంకా పెంచుదామని తెలిపారు.

## ప్యాకేజీ లభిస్తే..బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఖాయం



హైదరాబాద్:తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, అందుకు అడ్డుగా ఉన్న తనను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. అయితే.. కవిత కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ ది రికార్డు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు నిజమేనని తాను భావిస్తున్నానంటూ తెలిపారు. బీజేపీకి చెందిన కొంతమంది నేతలు పెద్ద ప్యాకేజీ లభిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ప్రతి ఎన్నికల్లో మా వాళ్లు కుమ్మక్కై-పోతారు, అందుకోసమే బీజేపీకి ఎంతో నష్టం జరిగిందని రాజాసింగ్ అన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయినది, ఎందుకు అనే విషయాన్ని సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చెబితే వారిని సస్పెండ్ చేస్తారు. అందుకే కార్యకర్తలు గానీ, నాయకులు గానీ పాపం నోరు మూసుకొని కూర్చుంటున్నారని ఆయన వాపోయారు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు.



జూరాలకు భారీగా వరద నీరు.. 12 గేట్లు ఎత్తివేత ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలతో జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల జలాశయానికి భారీగా వరద నీరు పోటెత్తుతోంది.



2లో

## ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు

- రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి..సేకరణ
- ధాన్యం సేకరణలో భద్రాద్రి, ఖమ్మం రికార్డు
- ఎప్పడూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు ఐదు లక్షలు
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం భట్టి

"రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం.

## వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం



- రాష్ట్రంలో నిర్మమత ప్రభుత్వం నడుస్తోంది
- ఇటీవలి అల్లర్లలో గుండాలకు స్వేచ్ఛ
- ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా
- ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు
- బెంగాల్ ర్యాలీలో మమతపై విరుకుపడ్డ మోదీ

2లో



## నీచ రాజకీయాలచేసే అలవాటు బిజెపికి లేదు

- పదేళ్లలో కెసిఆర్ ముంచితే..
- పదినెల్లో రేవంత్ ముంచాడు
- బిఆర్ఎస్ విలీనంపైతనకు తెలియదు
- కవిత మాటలను నమ్మడానికి సిద్ధంగా లేరు
- కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరవుతా
- మీడియాతో ఈటెల రాజేందర్ వెల్లడి

2లో

వేగుచుక్క

# ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు




ఖమ్మం: అన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రానంత ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. రికార్డు స్థాయిలో వస్తే.. అంతే స్థాయిలో సేకరిస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో ఎలాంటి లోపాలు జరగవద్దు. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదు. పేదల ఇంటి నిర్మాణానికి గత భారాస ప్రభుత్వం కూడా రూ.5 లక్షలు ప్రకటించింది. కానీ పదేళ్లలో ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. పూర్తిస్థాయిలో భూభారతి అమలుకు సిద్ధం అవుతున్నాం. ధరణిని రద్దు చేస్తామని ఎన్నికల అజెండాలోనే పెట్టాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అధికారులతో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాలకు సంబంధించిన ఇంఛార్జ్ మంత్రులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుంటున్నారు.. 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందజలో ఉంది.. వారం రోజుల్లో నగదు కూడా వారి అకౌంట్లలో జమ,ఏశాం.. గతంలో 2, 3 నెలలు అయిన నగదు వేసేవారు కాదు అని ఆరోపించారు. దీనికి అధికారులకు అభినందనలు.. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి.. దేశంలో ఎక్కడ లేని విధంగా 5 లక్షల రూపాయలతో ఇళ్లు శాంక్షన్ చేశాం.. నియోజకవర్గానికి 3500 ఇల్లు కేటాయించడం గొప్ప విషయం.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి హౌసింగ్ మంత్రి కసరత్తు చేస్తున్నారు.. 4 లక్షల 56 వేల ఇళ్లకు నిర్మాణాలు చేపడుతున్నాం అని భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే, సీజన్ మొదలైంది కాబట్టి విత్తనాల పంపిణీ మంచిగా జరగాలి.. నకిలీ విత్తనాలు అమ్మేవారికి జిల్లాలో పుట్టగతులు ఉండవు అని ఉప ముఖ్యమంత్రి భట్టి వార్నింగ్ ఇచ్చారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. ఇక, ధరణి పోర్టల్ ను పదేళ్లు చూశాం.. ధరణిలో బంధించిన వాటిని బయటకు తీసుకుని వచ్చేది, ప్రజలకు సరళమైన, న్యాయమైన హక్కులన్నింటినీ కాల రాసిన చట్టం ధరణి అని ఆరోపించారు. ధరణినీ తొలగిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం, దానికి తగ్గట్టు-గానే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కసరత్తు చేశారు.. అందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం పేదలకు అనుకూలంగా ఇది పని చేస్తుందని డిప్యూటీ- సీఎం విక్రమార్క పేర్కొన్నారు. ఇక, తెలంగాణ రాష్ట అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్లు జాగ్రత్తగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించాలి అన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి.. రాజీవ్ యువ వికాసానికి సంబంధించి లిస్ట్ మొత్తం ఇంఛార్జ్ మంత్రికి అప్పగించాలి అని సూచించారు. అధికారులు ఎక్కడ కూడా ఉదాసీనత వ్యక్త పర్చొద్దు.. గతంలో ఉన్న ప్రభుత్వం అన్ని విభాగాలను గాలికి వదిలి వేసింది.. బడ్జెట్ పరంగా ఏ ఇబ్బంది లేదు, పూర్తి స్థాయిగా నిధులు విడుదల చేస్తామన్నారు. సీజన్ వ్యాధులకుసంబంధించి కలెక్టర్లు సీరియస్ గా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. తాగునీరు లీకేజీలపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రుల్లో సేవలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. గతంలో ప్రభుత్వాలు విభాగాలను గాలికి వదిలేశాయి.

కానీ ప్రస్తుతం బడ్జెట్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదు, నిధులు విడుదల చేస్తాం అన్నారు. పదేళ్లు వెనుకపడ్డాం. ఇప్పుడు పరుగులు పెట్టక తప్పదు. లక్ష్యాలను చేరుకోవాలంటే ఇదే మార్గం అంటూ భట్టి స్పష్టమైన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# వరుస సంక్షోభాలతో బెంగాల్ సతమతం

ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇండియా... విక్షిత్ భారత్‌గా

మారాలంటే.. పశ్చిమ బెంగాల్‌ను కూడా విక్షిత్ పశ్చిమ బెంగాల్‌గా మార్చడం ముఖ్యమని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు కొత్త శక్తిని నింపాల్సిన అవసరం ఉందని.. జ్ఞానం.. విజ్ఞాన కేంద్రంగా 'మేక్ ఇన్ ఇండియా' కేంద్రంగా మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమత (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో నిర్వహించిన ర్యాలీలో ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రధాన రహదారులు, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారు. ఈ క్రమంలోనే పోలీసులపైనా ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో లాఠీఛార్జ్‌కి దారితీసింది. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసానికి దారితీసింది. ఈ ఘర్షణలపై కలకత్తా హైకోర్టు




నియమించిన నిజనిర్ధారణ కమిటీ- ఇచ్చిన నివేదికతో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వక్ఫ్ చట్ట వ్యతిరేక నిరసనల ఫలితంగా చెలరేగిన మతపరమైన ఘర్షణలకు స్థానిక ఎమ్మెల్యే, నాయకులు కారణమని నివేదిక ప్రస్తావించింది. ఆ సమయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఎత్తిచూపింది. ఈ వ్యవహారం భాజపా చేతిలో అస్త్రంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో తాజా ర్యాలీలో మమత ప్రభుత్వాన్ని మోదీ ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యక్తులు కొన్ని ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే, పోలీసులు దానిని అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ఇక్కడి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం లేదు. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా..? బుజ్జగింపు రాజకీయాల పేరిట గూండాలకు స్వేచ్ఛనిచ్చారు. ఇక్కడ ప్రతి సమస్యకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఏదీ పరిష్కారం కాదని మోదీ దుయ్యబట్టారు. ఈ ర్యాలీలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఆ ఆపరేషన్ ఇంకా పూర్తికాలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నాను. ఏప్రిల్ 22 జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. సిందూరం శక్తి ఏంటో మన ఆర్మీ ఉగ్రవాదులకు రుచి చూపించింది. మనం వారి ఇంట్లోకి ప్రవేశించి, మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ అర్థం చేసుకోవాలని అన్నారు. 2016లో జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్, 2019లో జరిగిన బాలాకోట్ దాడులు, ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి మోదీ పరోక్షంగా ప్రస్తావించారు.

# కెసిఆర్ తప్ప మరొకరి నాయకత్వాన్ని అంగీకరించం

హైదరాబాద్: కెసిఆర్ కుటుంబ రాజకీయం ముదరి పాకాన పడింది. రాజీకయ తుఫాన్ చెలరేగింది. తీవ్ర వాయుగుండంగా మారింది. తీరం ఎక్కడ ఎలా దాటుతుందో కానీ..అలజడి సృష్టిస్తోంది.

గాలిబుడగలా ఉన్న ఐక్యత పేలింది. కెసిఆర్ నాయకత్వాన్ని కెటిఆర్ హైజాక్ చేసి గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై సోదరి కవిత బాంబు పేల్చారు. కెసిఆర్ నాయకత్వం తప్ప ఎవరి నాయకత్వాన్ని అంగీకరించేది లేదని సోదరుడు కెటిఆర్‌కు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీని ఇష్టారీతిన నడుపుతూ...బిజెపికి గొడుగు కిందకు చేరుస్తు న్నారంటూ మండిపడ్డారు. వందిమాగధులతో విమర్శలు చేయిస్త ఊరుకునేది లేదని ఘాటు హెచ్చరికలు చేశారు. తనను సవాల్చేయాలనకుంటే ఉఫ్‌న ఊదేస్తానని హెచ్చరించారు. ట్విట్టర్ రాజకీయాలను సహించేది లేదని తేల్చారు. మొత్తంగా అన్న కెటిఆర్‌పై కవిత యుద్ధం ప్రకటించారు. పట్టుతప్పుతున్న పార్టీని కాపాడుకోవడమే తన లక్ష్యమని చెప్పకనే చెప్పారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం కవిత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తనకు నీతులు చెబుతోన్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు.. తెలంగాణ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలంటూ సూచించారు. కేసీఆర్ నీడలో పని చేస్తోన్న వారు.. తనపై ప్రతాపం చూపిస్తున్నారంటూ మండిపడ్డారు.బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే కుట్ర జరుగుతోందని ఆమె తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడే కుట్ర మొదలైందన్నారు. ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిస్తారా అని పరోక్షంగా కెటిఆర్ మండిపడ్డారు. జైలుకు వెళ్లేటప్పుడే పార్టీకి రాజీనామా చేస్తానన్నానని తెలిపానని అన్నారు. పార్టీ సోషల్ మీడియాలో తనను టార్గెట్ చేశారని, తన లేఖ లీక్ చేసిందెవరో చెప్పాల్సిందేనని మండిపడ్డారు. లీకు వీరులను పట్టుకోమంటే, గ్రీకువీరులు దండెత్తారని మండిపడ్డారు. తన జోలికి వస్తే బాగుండదని అంటూనే తానసలే మంచిదానిని కాదన్నారు. కేసీఆర్‌ను తామే నడిపిస్తున్నామని చెప్పుకుంటున్నారని, కేసీఆర్‌ను నడిపించేంత పెద్దవాళ్లా మీరు..అని ప్రశ్నించారు. తనపై



తప్పుడు వార్తలను పార్టీ ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు వస్తే ఎందుకు నిరసనలు తెలపలేదని, ఇంకో నేతకు నోటీసులు వస్తే ఎందుకు హంగామా చేశారని ప్రశ్నించారు. తాను వాళ్లలా చిల్లర రాజకీయాలు చేయనని, హుందాగా ఉంటానని పేర్కొన్నారు. పార్టీ చేయాల్సిన పనులు జాగృతి తరపున చేస్తున్నానని, కోవర్టులు ఉన్నప్పుడు ఎందుకు పక్కన పెట్టడం లేదని అన్నారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ ఒక్కరే నాయకుడని, పార్టీలో ఇంకెవరి నాయకత్వాన్ని

అంగీకరించనని నిర్మోహ మాటంగా తేల్చేసారు. మా నాన్నకు తాను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పి ఏందిరాబయ్? అంటూ ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తన అన్న కెటిఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఇంటి ఆడబిడ్డపై ఎటు పడితే అటు మాట్లాడితే సరి కాదన్నారు. దమ్ముంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీపై మీ ప్రతాపం చూపించాలంటూ ఈ సందర్భంగా పార్టీ నేతలకు ఆమె సవాల్ విసిరారు. తాను అసలే మంచి దాన్ని కాదని.. తాను నోరు విప్పితే తట్టుకోలేరంటూ బీఆర్‌ఎస్ నేతలను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు చేయకుండా.. ట్విట్టర్‌లో మెసేజ్‌లు పెడితే సరిపోతాయా? అంటూ ఆమె ప్రశ్నించారు. తనను రేవంత్ రెడ్డి కోవర్ట్ అనటం కరెక్టేనా అని నిలదీశారు.

పెయిడ్ ఆర్టిస్ట్‌లతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో రాయబారాలు జరిపే అవసరం తనకు లేదన్నారు. తనకు, కేసీఆర్ మధ్య దూరం పెంచే కుట్ర జరుగుతోందన్నారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభమో అందరికీ తెలుసునని, కావాలనే తనను ఎంపీ ఎన్నికల్లో ఓడించారని కూడా కవిత భగ్గుమన్నారు. పార్టీని బీజేపీలో కలపాలని చూస్తున్నారు. బీజేపీలో విలీనం చేయొద్దని చెప్పాను. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనంపై.. నేను జైల్లో ఉన్నప్పుడే అడిగితే చెప్పాను. 101 శాతం బీజేపీలో కలిపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఉంటే బీజేపీలో కలపడం కుదరదని.. అందుకే నన్ను కేసీఆర్‌కు దూరం చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న కుట్రలపై స్పష్టంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లోనే ఉన్న కొందరు కోవర్టులు నన్ను ఓడించేందుకు ప్రయత్నించారని, పేయిడ్ న్యూస్‌లు వేసి, లేఖల్ని లీక్ చేసి, బీజేపీలోకి బీఆర్‌ఎస్‌ను కలిపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండాలంటే ట్వీట్లు- చేయడం మాత్రమే కాదు, కార్యాచరణ చూపించాలి. పార్టీ నడిపించే సత్తా మీకు లేదని నన్ను తప్పుబడుతున్నవారు ముందుగా వాళ్లు ఏం చేశారో చెప్పాలని అంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. తమపై కుట్రలు జరుగుతున్నాయని, తనను బీఆర్‌ఎస్ నుంచి బయటకు నెట్టాలని ప్రయత్నాలు జరుగు తున్నాయని కవిత ఆరోపించారు. నాకు ఒక్క నాయకుడు మాత్రమే ఉన్నాడు..ఆయన కేసీఆర్. కొత్త పార్టీలు ఎందుకు..ఉన్న బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను కాపాడితే చాలు. తెలంగాణ జాగృతి ద్వారా నేను పార్టీకి, రాష్ట్రానికి సేవ చేస్తున్నా,అని స్పష్టం చేశారు. నేను పదవులు అడిగినవాళ్లలోని కాదు. కేసీఆర్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో పని చేస్తున్నా. నా కడుపులో బిడ్డ ఉన్నప్పుడు కూడా తెలంగాణ కోసం పోరాడిన నేను.మామూలు నాయకురాలు కాదు.



# పాక్‌తో యుద్ధం అర్ధంతరంగా ఎందుకు ఆపారు

మేడ్చల్: పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పే విషయంలో కేంద్రానికి సహకరించామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని చెప్పుకొచ్చారు. నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారని ప్రశ్నించారు. యుద్ధం చేయాలను కున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారని తెలిపారు. ఉగ్రవాదులను తుదముట్టించేవరకు సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు. ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జై హింద్ యాత్ర నిర్వహించారు. బాచుపల్లి వీఎన్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి జైహింద్ యాత్ర కొనసాగింది. జై హింద్ యాత్ర అనంతరం నిజాంపేట కొలన్ గోపాల్‌రెడ్డి కన్వెన్షన్‌లో ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధంతరంగా ఆపేశారా అని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకు వచ్చి యుద్ధం ఆపానని ప్రకటించారని గుర్తుచేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేశారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. పీవోకేను స్వాధీనం చేసుకోవాలని మోదీతో తాము చెప్పామని అన్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు

ఇందిరాగాంధీ వార్నింగ్ ఇచ్చారు. గతంలో యుద్ధం ఆపాలని ఇందిరాగాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారు. ఇందిరాగాంధీ అమెరికా బెదిరింపులకు లొంగలేదు. నాటి ఇందిర యుద్ధతంత్రాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ఇందిరాగాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకోవాలి. 1967 చైనా, 1971లో పాకిస్థాన్‌ని ఓడించినందుకా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలి. ట్రంప్ బెదిరించగానే మోదీ ఎందుకు తలొగ్గారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు. భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు- పెడతారా. యుద్ధం అంటే ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. భారతదేశ భద్రత విషయంలో అందరం ఏకమవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాలకు అండగా నిలిచామని ఉద్ఘాటించారు. దేశంపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కుట్ర చేసి కొడంగల్‌లో తనను ఓడిస్తే.. 14 రోజుల్లోనే మల్కాజ్‌గిరిలో ఎంపీగా గెలిపించారని ఉద్ఘాటించారు. అనంతరం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికయ్యానని.. ఇప్పుడు తెలంగాణ సీఎంగా ప్రజల ముందుకువచ్చానని గుర్తుచేసుకున్నారు. మేం నిర్వహించిన ర్యాలీ ఎన్నికలు, ఓట్ల కోసం కాదు..సైనికుల ఆత్మ స్థైర్యం, ఆత్మగౌరవం నిలబెట్టడానికి. కాలం చెల్లిన రూపాయి ప్రధాని మోదీ. దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరం. బలూచిస్థాన్‌ను విడగొట్టి మరో దేశంగా చేయమన్నాం. ఇది చేతకాదు కానీ.. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారు. యుద్ధంలో ఎన్ని రఫెల్ విమానాలు నేలకూలాయో లెక్క చెప్పండి. పాక్‌ను ఓడించాలంటే ఇందిరాగాంధీ మార్గంలో..నడవాలని ప్రధాని మోదీకి సూచించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నీచ రాజకీయాలచేసే అలవాటు బిజెపికి లేదు



హైదరాబాద్:నీచ రాజకీయాలు చేసే అలవాటు బిజెపికి లేదని బిజెపి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నీచ రాజీకీయాలు భాజపాకి అలవాటు లేదు. పదేళ్లలో కేసీఆర్‌ను నమ్మి ప్రజలు మోసపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్‌ను నమ్మి మరోసారి మోసపోయారు. పక్కరాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. తెలంగాణ వెలవెలబోతోందని వ్యాఖ్యానించారు. అందుకే తెలంగాణలో భాజపా అధికారంలో ఉంటే బాగుండని ప్రజలు భావిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎవరూ కొత్తగా పార్టీ పెట్టబోరని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో అర్థం కావడం లేదని తెలిపారు. భాజపా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా స్టేట్ ఫైట్ తప్ప.. స్ట్రీట్ ఫైట్

చేయదు. అప్పుల ఊబి నుంచి రాష్ట్రం బయటపడాలంటే భాజపా అధికారంలోకి రావాలన్నారు. కవిత తెలంగాణ వాదులను కలవడం నేరం కాదు..కానీ, నాయకులు, కుటుంబీకుల ఫోన్లు ట్యాప్ చేయడం మాత్రం నేరం. ఇవన్నీ నేర్పించింది కేసీఆర్ కాదా? నేతల మధ్య కంచెలు నాటింది కేసీఆర్.. దాన్ని రేవంత్ కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ఎదురుపడితే నమస్కారం పెడతా.. అది సంస్కారం. కాళేశ్వరం కమిషన్ విచారణకు బాధ్యతాయతమైన ఎంపీగా, ఆర్థికశాఖ మాజీ మంత్రిగా హాజరవుతానని ఈటల తెలిపారు. భారాస.. భాజపాలో ఎందుకు విలీనమవుతుంది. మేమెందుకు వారిని చేర్చుకుంటాం. ఉద్యమకారులను కలిసి ఎమ్మెల్సీ కవిత ఏం చేస్తారు. కవిత దగ్గర ఉద్యమకారుల జాబితా ఉందా? మావోయిస్టుల అంశంపై కేసీఆర్ ద్వంద్వ వైఖరి కనబరిచారు. అధికారంలోకి రాకముందే జైలుకు వెళ్లి.. కూర రాజన్నను కలిశారు. అధికారంలోకి వచ్చాక నెల రోజుల్లోనే ఆయనలో భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా వచ్చింది. ఇటీవల నిర్వహించిన భారాస సమావేశంలో అపరేషన్ కగార్ ఆపాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు రాశారా అని ఈటల ప్రశ్నించారు. ఇకపోతే కొత్తగా ఎవరు పార్టీ పెట్టినా నమ్మే పరిస్థితి లేదని ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ, బీజేపీలో కలుపుతున్నారన్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత జైల్లో ఉన్నప్పుడు విలీనం కోసం బీఆర్‌ఎస్ ప్రయత్నం చేయొచ్చన్నారు.. బీజేపీ నుంచి ఎవరూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను కలుస్తానని కవిత అంటోందని.. కవిత కలిసి ఏం చేస్తదని విమర్శించారు. అందులో కొందరు చనిపోయారని.. కొందరు ఇంకెక్కడో ఉన్నారో తెలియదు, మరి కొందరు పార్టీలు మారారని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ముంచితే.. పది నెలల్లోనే రేవంత్ ముంచాడని ఎద్దేవా చేశారు. వీళ్లకు మరోసారి ఓటు వేయద్దొని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు. పక్క రాష్ట్రం కేంద్ర సహకారంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఇక్కడ మాత్రం అప్పులతో ఇబ్బంది పడే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలంటే బీజేపీ వస్తేనే సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కవిత విలీనం కామెంట్లపై ఈటల రాజేందర్ స్పందించారు.. గాలి వార్తలకు నేను ఏం సమాధానం చెప్పాలి.. తెలిస్తే చెబుతా కానీ, తెలియకుండా ఏం చెప్పాలి.. నేను జిమేదార్ ఉన్న రాజకీయ నాయకుడిని.. వాస్తవం ఉంటే మాట్లాడతా, లేకుండా మాట్లాడనని స్పష్టం చేశారు.

వేగుచుక్క

# సర్కార్ శుభవార్త.. ఖాతాలో రూ.2 లక్షలు..

అంగన్వాడీ సిబ్బందిపై రేవంత్ సర్కార్ వరాల జల్లు కురిపించింది. తెలంగాణలోని అంగన్వాడీ సిబ్బందికి రేవంత్ సర్కార్ పండగలాంటి వార్త చెప్పుకొచ్చింది. పదవీ విరమణ సమయంలో లభించే ప్రయోజనాలను పెంచేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. ఇక నుంచి రిటైర్ అయ్యే ప్రతి అంగన్వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, అలానే హెల్పర్‌కు రూ.లక్ష వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

తెలంగాణ: రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందికి ఊహించని కానుక ప్రకటించింది! రిటైర్మెంట్ సమయంలో వారికి ఏకంగా రెండు లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందనుంది. అంతే కాదు, ఉద్యోగులకు కూడా డీఏ బకాయిలు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇంతకీ ఈ వరాల జల్లు ఎవరికి, ఎలా వర్తిస్తుందో తెలుసుకోవాలంటే మరికొంత ఆగాల్సిందే. జూన్ 2న సీఎం రేవంత్ రెడ్డి దీనిపై అధికారిక ప్రకటన చేయనున్నారు! ఇంతకు ఎవరి ఖాతాల్లో ఈ మొత్తం జయ చేయనుంది.. ఎందుకు అంటే.. తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీల కోసం ఈ నిర్ణయం తీసుకుని వారికి భారీ శుభవార్త చెప్పింది. అంగన్వాడీ సిబ్బందిపై రేవంత్ సర్కార్ వరాల జల్లు కురిపించింది.

తెలంగాణలోని అంగన్వాడీ సిబ్బందికి రేవంత్ సర్కార్ పండగలాంటి వార్త చెప్పుకొచ్చింది. పదవీ విరమణ సమయంలో లభించే ప్రయోజనాలను పెంచేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. ఇక నుంచి రిటైర్ అయ్యే ప్రతి అంగన్వాడీ టీచర్‌కు రూ.2 లక్షలు, అలానే హెల్పర్‌కు రూ.లక్ష వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ కూడా ఆమోదం తెలిపింది. అతి త్వరలో దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నా యి. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న అధికారిక ప్రకటన చేయనున్నారని తెలుస్తోంది.



అలానే జూన్ 2న తెలంగాణ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులపై వరాల జల్లు కురిపించేందుకు రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటిని విడుదల చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రెండు డీఏల్లో ఒక దాన్ని జూన్‌లో, మరోక దాన్ని ఆగస్టులో ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలానే ఉద్యోగులు, వారి కుటుంబాలకు హెల్త్ కార్డు అందించే దానిపై కూడా రేవంత్ కీలక ప్రకటన చేయనున్నారని సమాచారం.

ఇదిలా ఉంటే నేడు తెలంగాణ ప్రభుత్వం.. కౌమార బాలికల్లో రక్త హీనత సమస్య పరిష్కారం కోసం ఇందిరమ్మ అమృతం పథకాన్ని ప్రారంభిస్తున్న సంగతి తెలిసిందే. మంత్రి సీతక్క.. నేడు భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెంలో ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ అమృతం కింద కౌమార బాలికలకు నెలకు రెండు సార్లుగా 15 చొప్పున చిక్కీలు ఇవ్వనున్నారు. పల్లీలు, చిరుధాన్యలతో చేసిన చిక్కీలను.. అంగన్వాడీల ద్వారా 14-18 సంవత్సరాల బాలికలకు ఉచితంగా ఇవ్వనున్నారు. ముందుగా మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించి.. తర్వాత మిగతా జిల్లాల్లో కూడా అమలు చేయాలని భావిస్తున్నారు.

# జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ..



హైదరాబాద్: జూన్ మాసం వచ్చిందంటే చాలు.. తెలంగాణలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ హడావుడి మొదలవుతుంది. ప్రతి ఏడాది మృగశిర కార్తె సందర్భంగా జూన్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు.. ప్రతి ఏటా చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందుకోసం నగరంలోని వారే కాక రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనాలు హాజరవుతుంటారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ ఏడాది కూడా అలానే జరుగుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా గురువారం నాడు వారు మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా జూన్ 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ మొదలవుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. మరుసటి రోజు అనగా.. జూన్ 9, ఉదయం 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో దగ్గు, ఆస్తమా, దమ్ము, ఉబ్బసం, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారు వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని సూచించారు.

ఇక గతేడాది సుమారు 2.5 లక్షల మంది చేప ప్రసాదం తీసుకున్నారని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ సంవత్సరం ఈ సంఖ్య మరింత పెరిగి.. మూడు లక్షల మంది చేప ప్రసాదం తీసుకుంటారని అంచనా వేస్తున్నామన్నారు. చేప ప్రసాదం కోసం ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాక దేశ నలుమూలల, విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో జనాలు తరలి వస్తారని చెప్పుకొచ్చారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు బత్తిని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. మాస్కులు, గ్లౌస్‌లు ధరించి, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకుంటూ చేప ప్రసాదం పంపిణీ చేస్తామని వారు చెప్పుకొచ్చారు. అయితే చేప ప్రసాదం తీసుకున్న వారు 45 రోజుల పాటు ఆహార నియమానలు కచ్చితంగా పాటించాలన్నారు. గర్భిణీ స్త్రీలు తప్ప అందరూ దీన్ని తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

చేపప్రసాదం కోసం తెలంగాణ మత్స్య శాఖ ఈ సంవత్సరం 1.25 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచనుందని తెలిపారు. అయితే పోయిన సంవత్సరం చేప ప్రసాదం కోసం వినియోగించే.. ఒక్కో చేపకు రూ. 40 చెల్లించామన్నారు. ఈ ఏడాది ధరపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అంతేకాక 200 మంది వాలంటీర్లు చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సాయం చేస్తారన్నారు. ప్రసాదం కోసం వచ్చే వారి కోసం పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత భోజనం అందించనున్నట్లు తెలిపారు.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఏకే సింగ్..



తెలంగాణ: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ని నియమించాలని.. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సింగ్, గతంలో ఝూర?ండ్ హైకోర్టులో న్యాయమూర్తిగా, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆయన కుటుంబంలో చాలామంది న్యాయమూర్తులుగా సేవలు అందించారు. ఈ నియామకానికి సంబంధించిన నిర్ణయాన్ని కొలీజియం మే 26న తీసుకుంది. ఆమోదం కోసం కేంద్రానికి పంపింది. ఆమోదం లభిస్తే..ఏకే సింగ్ తెలంగాణ హైకోర్టు సీజేగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్(ఏకే సింగ్)ను నియమించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కొలీజియం నిర్ణయం తీసుకుంది. జస్టిస్ ఏకే సింగ్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా ఉన్నారు. ఈక్రమంలో ఆయనను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని.. సుప్రీంకోర్టు కోలిజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ ఏడాది జనవరి వరకు జస్టిస్ ఆలోక్ అరాధే.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. అయితే జనవరిలో ఆయనను బాంబే హైకోర్టుకు బదిలీ చేశారు. ఈస్థానంలో ఇప్పుడు ఏకేసింగ్ పేరును కోలిజియం ప్రతిపాదించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం.. మూడు రోజుల క్రితం అనగా మే 26న సమావేశం నిర్వహించింది. దీనిలోనే 34 మంది న్యాయమూర్తలపై నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగానే జస్టిస్ ఏకే సింగ్‌ని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని నిర్ణయించింది.

ఏకే సింగ్ విషయానికి వస్తే ఆయన సొంత హైకోర్టు ఝూరండ్. ఆయన తల్లిదండ్రులు ఇద్దరు వైద్యులే. 1965, జూలై 7న ఏకే సింగ్ జన్మించారు. ఆయన కుటుంబంలో పలువురు న్యాయవాద వృత్తిలోనే కొనసాగారు. ఆయన ముత్తాత, తాత, మేనమామలు పలువురు న్యాయమూర్తులుగా సేవలందించారు. ఏకే సింగ్ చదువు వివరాలకు వస్తే.. ఆయన దేశ రాజధాని న్యూఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ డిగ్రీ తీసుకున్నారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని 2000 వరకు పట్నా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. సివిల్, లేబర్, క్రిమినల్, రాజ్యాంగం, ఆర్బిట్రేషన్, సర్వీస్, కేసుల్లో న్యాయవాదిగా ఎంతో అనుభవం సంపాదించారు.

# నేను జైల్లో ఉన్నప్పుడే వాళ్లు ఆ ప్రతిపాదన తీసుకొచ్చారు

తెలంగాణ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్‌కు రాసిన లేఖ రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయమై తొలిసారిగా స్పందించిన ఆమె.. పార్టీ బలోపేతం కోసమే లేఖ రాశానని, అవసరమైతే వంద లేఖలు రాస్తానని స్పష్టం చేశారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారని, బీఆర్ఎస్ ఎంపీల్లో కొందరు కోవర్టులున్నారంటూ ఆమె సంచలన ఆరోపణలు చేశారు. తనను అరెస్ట్ చేసే సమయంలోనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని చెప్పానని కవిత తెలిపారు. బీజేపీతో బీఆర్ఎస్‌ను విలీనం చేసే ప్రయత్నాలను తాను అడ్డుకున్నానని ఆమె పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాసిన లేఖ.. తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. లేఖ బయటకు రావడంతో.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలున్నాయనే వాదన తెర మీదకు వచ్చింది. ఇదిలా ఉండగా.. లేఖ వివాదంపై తాజాగా చేసిన చిట్‌చాట్‌లో కవిత స్పందిస్తూ.. మరింత సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను లేఖ రాసింది తన తండ్రికే అని.. అది కూడా పార్టీ బలోపేతం కోసమే అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరో వంద లేఖలు రాస్తానని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 'చంద్రబాబు బాబు తెలంగాణ ప్రాజెక్ట్‌లను వ్యతిరేకించలేదు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నారు.



బనకచర్ల ప్రాజెక్టు.. బాబు, రేవంత్‌తో భేటీ తర్వాతనే తెర మీదకు వచ్చింది. ఈ అంశంలో ప్రభుత్వంపై ఒత్తడి తేవాలి.. నీటిపారుదల శాఖపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తాం' అని చెప్పుకొచ్చారు.

బీఆర్ఎస్ పార్టీలో తనకు నీతులు చెబుతున్న వారు.. కేసీఆర్‌కి కాళేశ్వరం నోటీస్‌లు ఇస్తే పార్టీ పరంగా ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేయలేదు ఎందుకు అని ప్రశ్నించారు. తన మీద పడి విమర్శలు చేసి..పెయిడ్ వార్తలు రాయిస్తే ఏం వస్తుందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఓ ప్రతిక తనపై తప్పుడు వార్తలు రాస్తుందని.. తన మీద కుట్రతోనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆమె మండి పడ్డారు. బీఆర్ఎస్ పార్టీలోని ఎంపీల్లో కొందరు కోవర్టులున్నారని.. వారే తనను ఓడగొట్టారంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

'ఎమ్మెల్యేలు నా గెలుపు కోసం పని చేయలేదు.. అందుకే అదే జిల్లాలో ప్రోటోకాల్ ఉండాలనే.. కేసీఆర్ నాకు ఎమ్మెల్సీ ఇచ్చారు. నేను ఎప్పుడూ పదవులు అడగలేదు. ఒక్క కేసీఆర్ తప్ప ఇప్పుడు నన్ను విమర్శిస్తున్నవారు ఏం చేశారో చెప్పాలి. నేను మంచిదాన్ని కాదు.. నాతో పెట్టుకోవద్దు. నన్ను అరెస్ట్ చేసే సమయంలోనే కేసీఆర్ వద్దకు వెళ్ళి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా అని అడిగాను. అప్పుడాయన నాపై కుట్రతో నిన్ను అరెస్ట్ చేస్తున్నారని చెప్పారు. పార్టీ చేయలేని పనులు జాగృతి తరుపున నేను చేస్తున్నాను. కేవలం ట్వీట్‌లు పెడితే సరిపోతుందా' అని ప్రశ్నించారు. 'నాకు నీతులు చెప్పేవాళ్ళు కొందరు బీజేపీతో, కొందరు కాంగ్రెస్‌తో ఉన్నారు. పార్టీ బలోపేతం కోసం వారు ఏం చేస్తున్నారు. సభ సక్సెస్ చేసింది కేసీఆర్. మా నాన్నకు లేఖ రాశాను.. పార్టీ కోసమే రాశాను.. వంద లేఖలు రాస్తా.. బీజేపీని కట్టడి చేయకుండా బీఆర్ఎస్‌ని.. కాషాయ పార్టీలో విలీనం చేసే ప్రయత్నం చేస్తున్నారు. నేను జైల్లో ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదనను నా దగ్గరకు తెచ్చారు. నేను వద్దన్నాను. చంద్రబాబు ద్వారా మమ్మల్ని కలవాలని ప్రయత్నించారు. నేను అందుకు ఒప్పుకోలేదు. కావాలంటే మరో ఏడాదంతా జైల్లోనే ఉంటాను. కానీ బీఆర్ఎస్‌ని బీజేపీలో విలీం చేయవద్దని కోరాను' అని చెప్పుకొచ్చారు.

'నేను రాసిన లేఖను బయట పెట్టిన వారు ఎవరు.. నా పై వార్తలు రాపిస్తున్న దూతలు ఎవరు.. నేను సూటిగా మాట్లాడతా. వెన్ను పోటు రాజకీయాలు చేయను. లేఖ లీక్ పై పార్టీ సమాధానం చెప్పాలి.. కాంగ్రెస్ పార్టీ తో నేను టచ్‌లో ఉన్నానని అబద్ధపు రాతలు రాస్తున్నారు.. దేశంలో, రాష్ట్రంలో అది మునిగిపోయే పడవ. అలాంటి పార్టీలోకి నేను ఎందుకు వెళ్తాను' అని కవిత ప్రశ్నించారు.

# తిరుపతి వెళ్లే ప్రయాణికులు శుభవార్త..

పెద్దపల్లి: జిల్లా ప్రజలకు తిరుపతి వెళ్లేందుకు కరీంనగర్ తిరుపతి బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండేది. కానీ ఇటీవల ఆ ట్రైన్ హాల్టింగ్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిలిపివేశారు. కారణాలు ఏమైనప్పటికీ.. ఈ నిర్ణయంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో తిరుపతికి వెళ్లేందుకు సమయం, ఖర్చు రెండూ పెరగడంతో ప్రజలు తమ సమస్యను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ వెంటనే రైల్వే అధికారులతో మాట్లాడటంతో సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ఎప్పటిలాగే రైలు హాల్టింగ్ సౌకర్యం పునరుద్ధరించబడింది.

ప్రతి సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. దేశంలోని నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తిరుపతికి తరలివచ్చి శ్రీవారి మొక్కులు చెల్లించుకుంటారు. తిరుమలకు చేరుకోవడానికి అనేక రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది తమ సొంత వాహనాల్లో ప్రయాణిస్తే.. మరికొందరు బస్సులు, ఇతర ప్రభుత్వ రవాణా సేవలను ఉపయోగిస్తారు. అయితే.. ఎక్కువ మంది భక్తులు రైలు మార్గాన్ని ఆశ్రయించడం జరుగుతుంది. దురదృష్టవశాత్తు.. ఇటీవల పెద్దపల్లి జిల్లా వాసులు తిరుపతికి వెళ్లే రైలు సర్వీసు విషయంలో ఒక సమస్యను ఎదుర్కొన్నారు.

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ఆగే కరీంనగర్ - తిరుపతి బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ (12762/12761) హాల్టింగ్‌ను తొలగించడంతో ఈ ప్రాంత భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతే కాదు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కూడా ఈ విషయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజిన్ రివర్స్?ల్ సమయాన్ని తగ్గించడం, అలాగే కొత్త బై పాస్ లైన్ ప్రారంభించిన తర్వాత పెద్దపల్లిలో హాల్టింగ్?ను దారి మళ్లించారని ప్రయాణికులు పెద్దపల్లి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణమే స్పందించిన ఆయన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు.

పెద్దపల్లిలో ఈ హాల్టింగ్ నిలిపివేయడం వల్ల చాలా మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ప్రయాణికుల ఖర్చు పెరగడమే కాకుండా తిరుపతి దైవ దర్శనానికి వెళ్లలేకపోతున్నారని సౌత్ సెంట్రల్ రైల్వే దృష్టికి ఎంపీ తీసుకెళ్లారు. ఎంపీ చెప్పిన విషయాన్ని విన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెంటనే స్పందించారు. తొలగించిన హాల్టింగ్?ను రైల్వే శాఖ పునరుద్ధరించింది. పెద్దపల్లి ఎంపీ రిక్వెస్ట్?తో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో తిరిగి కరీంనగర్ తిరుపతి బై వీక్లీ ఎక్స్ ప్రెస్



హాల్టింగ్ పునరుద్ధరించామని రైల్వే జనరల్ మేనేజర్ అధికారికంగా ప్రకటించారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్?లో నిలిచిపోయిన హాల్టింగ్ తిరిగి ప్రారంభం కావడంతో పెద్దపల్లి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పెద్దపల్లి ఎంపీ వినతులతో రైల్వే సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవడం పెద్దపల్లి ప్రజల అదృష్టమని జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. హాల్టింగ్ పునరుద్ధరించడంతో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి ఎంపీ వెంట చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కూడా ఉన్నారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్ హాల్టింగ్ పునరుద్ధరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో మరో ఫ్లై ఓవర్..



హైదరాబాద్: హైదరబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయడం కోసం కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడంతో పాటుగా.. ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించింది. నగరవాసులను బాగా ఇబ్బందిపెట్టేది ట్రాఫిక్ సమస్య. దీని పరిష్కారం కోసం ప్రభుత్వం ఫ్లై ఓవర్ల నిర్మాణాన్ని చేపట్టడమే కాక.. శరవేగంగా వాటిని పూర్తి చేసే పనిలో ఉంది. దీనిలో భాగంగా త్వరలోనే కొండాపూర్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలో తాజాగా జీహెచ్ఎంసీ నగరంలో మరో భారీ ఫ్లై ఓవర్‌ని నిర్మించేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడమే కాక.. ప్రయాణ సమయం ఆదా చేయడం కోసం మరో భారీ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. హెచ్ సిటీ (హైదరాబా ద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్ ఫర్ మేటివ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్)లో భాగంగా గచ్చిబౌలి రాడిసన్ బ్లూ హోటల్ నుంచి డీఎల్ఎఫ్ మీదుగా ఈ ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు రెడీ చేస్తుంది. సుమారు 150 కోట్ల రూపాయల ఖర్చుతో.. మూడు లేన్లలో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని భావిస్తుంది. అలానే ఒక చోట అండర్ పాస్ నిర్మించేందుకు కూడా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని సమాచారం.

ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే.. హైటెక్ సిటీ, కొండాపూర్, కొత్తగూడ మీదుగా వచ్చే వాహనాలు.. నానక్ రాంగూడ, లింగంపల్లి వైపు సులభంగా వెళ్లవచ్చు. ఫ్లైఓవర్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి.. వినియోగంలోకి తెచ్చి.. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాల్సిందిగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లుగా తెలుస్తోంది.

ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ అధికారులు.. దీనిపై స్టడీ చేసేందుకు చెన్నైకి చెందిన ఓ కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే వీరు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. దీని ఆధారంగా ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రభుత్వం టెండర్లను పిలవనుంది. జూన్ నెలలో దీని పనులు ప్రారంభం కానున్నాయి అంటున్నారు.

**హెచ్ సిటీలో భాగంగానే..**

హెచ్ సిటీపై ప్రధానంగా దృష్టి సారించింది. దీనిలో భాగంగానే రూ. 7,032 కోట్ల వ్యయంతో 58 పనులు ప్రారంభించింది. దీనిలో 28 ఫ్లైఓవర్ల నిర్మాణం, 13 అండర్ పాస్‌లు, నాలుగు రైల్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, 3 రైల్వే అండర్ బ్రిడ్జిలు, 10 రోడ్డు విస్తరణ పనులు ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనుల రెడీ చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టుల్లో.. కొన్నిటెండర్ల దశలో ఉండగా.. మరికొన్నిటికి టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ స్టేజీలో ఉన్నాయి. త్వరలోనే మొదలు పెట్టబోయే రాడిసన్ బ్లూ హోటల్ నుంచి డీఎల్ఎఫ్ వరకు నిర్మించబోయే ఫ్లై ఓవర్ నిర్మాణం కూడా హెచ్‌సిటిలో భాగమే.

# ముగిసిన సరస్వతి పుష్కరాలు.. కాళేశ్వరం హుండీకి భారీగా ఆదాయం..


తెలంగాణ: సరస్వతి నది పుష్కరాలు ప్రశాం తంగా ముగిశాయి. అంతర్వాహిని అయిన సరస్వతి నది తెలంగాణలో త్రివేణి సంగమం వద్ద కలుస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర క్షేత్రం ఉన్న త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు జరిగాయి. పుష్కరాల నేపథ్యంలో ఆచరించేందుకు తెలంగాణ నుంచే కాక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనాలు తరలి వచ్చి.. పుష్కర స్నానం ఆచరించారు. దీంతో పుష్కరాల వేళ కాళేశ్వరం హుండీకి భారీగా ఆదాయం వచ్చింది. 12 రోజుల పాటు సాగిన సరస్వతి పుష్కరాలు.. మే 15న ప్రారంభం అయ్యి.. మే, 26న ముగిశా యి. పుష్కర స్నానం



ఆచరించేందుకు ఈ 12 రోజుల పాటు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. పుష్కరాల వేళ ప్రతి రోజు వేలాది మంది భక్తులు కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామి వారికి భారీగా కానుకలు సమర్పించుకున్నారు. పుష్కరాలు ముగిసిన సందర్భంగా కాళేశ్వరం ఆలయంలోని హుండీని లెక్కించారు ఆలయ సిబ్బంది.

పుష్కరాలు ముగియడంతో.. తాజాగా కాళేశ్వరం ఆలయ అధికారులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. వరంగల్ సహాయ కమిషనర్ సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో మొత్తం 12 రోజులతో పాటుగా అంతకు ముందు రెండు నెలలకు గాను కాళేశ్వరం ఆలయానికి రూ.2.83 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డబ్బుతో పాటు బంగారం 15 గ్రాములు, 750 గ్రాముల వెండి కూడా వచ్చినట్లు తెలిపారు. అలానే పుష్కరాల వేళ ఆర్టీసీకి కూడా భారీగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ 12 రోజుల్లోనే ఆర్టీసీకి సుమారు రూ.8 కోట్ల ఆదాయం లభించింది అన్నారు.

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఈ 12 రోజుల పాటు భక్తుల పుణ్యస్నా



నాలు, దర్శనాలతో త్రివేణి సంగమం పులకించిపోయింది. కాళేశ్వరం ముక్తీశ్వరుడిని దర్శించుకునేందుకు నిత్యం భారీ ఎత్తున భక్తులు ఆలయాన్ని సందర్శించారు. పుష్కరాల నేపథ్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సామాన్య భక్తులతో పాటుగా, వీఐపీలు, స్వాములు, పీఠాధిపతులతో రాకతో త్రివేణి సంగమంలో ఈ 12 రోజులు సందడి నెలకొంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవే తొలి పుష్కరాలు. దీంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీటిని నిర్వహించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంది.

# బతికించే "చదువు" కావాలి!




వేగుచుక్క న్యూస్,

"ఎంత కష్టపడి చదువుదామన్నా చదవలేకపోతున్నా... బతకాలంటే భయమేస్తోందమ్మా' అంటూ ఉత్తరం రాసిపెట్టి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి మొన్న జనవరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. జేఈఈ మెయిన్స్ బాగా రాయలేదని చెప్పి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ కుర్రాడు పది రోజుల కిందట ఉరేసుకున్నాడు. పదో తరగతిలో తప్పామని కొందరు, ఇంటర్‌లో సబ్జెక్టులు మిగిలిపోయాయని మరికొందరు, పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని ఇంకొందరు... ఇలా గడచిన రెండు మూడు నెలల్లోనే తెలుగు రాష్ట్రాల్లో పలువురు పిల్లలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో తాజాగా రెండు రోజుల్లో నలుగురు విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. పోటీపరీక్షల శిక్షణకు వాసికెక్కిన రాజస్థాన్‌లోని కోటాలో ఈ ఏడాదిలో ఇంతవరకు 15 మంది అభ్యర్థులు తమకుతామే మరణశాసనాలు రాసుకున్నారు. భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన చదువులు భావితరాన్ని విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నాయి. మార్కులూ ర్యాంకులూ తప్ప విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని పట్టించుకోని అశాస్త్రీయ మూస విద్యా ధోరణులే

## విద్యార్థులను బలి తీసుకుంటున్న కార్పొరేట్ విద్యా సంస్థలు.
## దేశంలో పదేళ్లలో 1.10 లక్షల మంది విద్యార్థుల ఆత్మహత్యలు.

దేశీయంగా ఎన్నో అర్థాంతర మరణాలకు కారణమవుతున్నాయి!లి

**పదేళ్లలో లక్షల మంది విద్యార్థులు ..**

2012లో దేశవ్యాప్తంగా 6654 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు ఒడిగడితే- 2022లో అంతకు దాదాపు రెట్టింపు స్థాయిలో 13,044 మంది కన్నవాళ్లకు కన్నీళ్లు మిగిల్చి వెళ్లిపోయారు. ఆ పదేళ్లలో మన దేశంలో 1.10 లక్షల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. బలవన్మరణాలకు పాల్పడుతున్న వారికి ఎన్నో రెట్లు ఎక్కువ సంఖ్యలో పిల్లలు మానసిక వేదనతో కుంగి కృశించిపోతున్నారు. హైస్కూల్ దశ నుంచే చాలామంది విద్యార్థులు కుంగుబాటుకు బాధితులవుతున్నారని మూడేళ్ల క్రితం ఎన్‌సీఈఆర్‌టీ చేసిన సర్వే నివేదికే స్పష్టీకరించింది.

**ఆటవిడుపునకు అవకాశం మచ్చుకైనా లేదు.**

ట్యూషన్లు, స్టడీఅవర్లు, ప్రాజెక్టులతో ఆటవిడుపునకు అవకాశం లేకపోవడం బడి పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే- ఇష్టంలేని చదువులను బలవంతంగా చదవాల్సి రావడం డిగ్రీ, ఆపైస్థాయి విద్యార్థుల్లో జీవితేచ్ఛను చంపేస్తోంది! నవతరం సహజ నైపుణ్యాలకు సానపడుతూ, వారికి విజ్ఞానాన్ని అందిస్తూ, వ్యక్తిత్వాన్ని అలవరచడమే విద్య పరమోద్దేశం. కానీ, మన బట్టీ చదువులు ఏం చేస్తున్నాయి? నాలుగు ముక్కలు ముక్కున పట్టుకుని పరీక్షల్లో కక్కేస్తే చాలు- అదే తెలివికి కొలమానంగా భావిస్తున్నాయి. దీనికితోడు తమకు నచ్చిన కోర్సులే చేయాలనే తల్లిదండ్రుల పంతాలు పిల్లలకు ప్రాణాంతకమవుతున్నాయి. భారతావనిలో నలభై రంగాల్లో 250 కెరీర్ ఆప్షన్లు, దాదాపు అయిదు వేల రకాల కొలువులు అందుబాటులో ఉన్నట్లు అంచనా. కానీ, మన విద్యార్థుల్లో నూటికి 93 మందికి తెలిసినవి ఏడు కెరీర్ ఆప్షన్లేనని (ఇంజినీరింగ్, మెడిసిన్ వంటివి) లోగడే వెల్లడైంది.

ఇలాంటి వేలంవెర్రి చదువులతో విద్యార్థుల్లో నైపుణ్యాలు కొరవడుతున్నాయి. దాంతో నిపుణ మానవ వనరుల కొరతతో పరిశ్రమలూ ఇబ్బందిపడుతున్నాయి. దేశాభివృద్ధికి ఇది ఎంతమాత్రం మంచిది కాదు.

**ఒత్తిడి లేని "శాస్త్రీయ విద్యా" విధానం కావలి.**

విద్యావ్యవస్థలోని లోపాల మూలంగా పిల్లల ప్రజ్ఞాపాటవాలు దారితప్పి నేరాల బాటపడుతున్నాయి. యువభారతం ప్రగతి వనంగా విరాజిల్లాలంటే- వ్యక్తిగత అభిరుచులకు తగిన కోర్సులను ఎంచుకునే స్వేచ్ఛను పిల్లలకు ఇవ్వాలి. అన్ని విద్యాసంస్థల్లో మానసిక వైద్యసేవలు అందుబాటులోకి రావాలి. బోధనలో సృజనాత్మకతకు, పాఠ్యప్రణాళికల్లో వ్యాయామవిద్యకూ పెద్దపీట వేయాలి. స్వేచ్ఛగా చదువుతూ, నిత్య జీవితంలో ఉపయోగ పడే విద్యను ప్రభుత్వాలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**నేటి విద్యా వ్యవస్థకు అద్దం పట్టిన అనగనగా.. చిత్రం.**

నేడు విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ వ్యవస్థ, వల్ల విద్యార్థులు ఎంతడి ఒత్తిడికి గురవుతున్నారు అనే విషయాన్ని తెలియజెప్పుతూ తీసిన "అనగనగా" చిత్రం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది.

# ఎంపీ అరవింద్ చొరవతో "నవోదయ"కు మోక్షం.

**నిజామాబాద్, జగిత్యాలలో ఈ విద్యా సంవత్సరంలో నే తరగతులు ప్రారంభం.**

**ఉత్తర్వులు జారి చేసిన అధికారులు.**

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 29

ఎంపీ అరవింద్ చొరవతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో రెండు జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కాగా ఎంపీ కృషితో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని నవోదయ అధికారులు ఆదేశించారు. దీంట్లో భాగంగా విద్యాలయాల శాశ్వత మరియు తాత్కాలిక స్థలాలకు సంబంధించి అవసరమైన చర్యలు ప్రారంభించాలని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో శాశ్వత భవన నిర్మాణానికి జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 1063 లో, తాత్కాలిక వసతి కొరకు నాగారం శివారు లోని ప్రభుత్వ డైట్ కళాశాల ఎంపిక చేయబడ్డాయని ఆయన





లేఖలో పేర్కొన్నారు. జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని ఎలాంటి వివాదాలు లేని కలిగోట శివారులోని 30 ఎకరాల భూమి నవోదయ విద్యాలయ సమితి పేరుపై బదలాయింపు చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా శాశ్వత మరియు తాత్కాలిక భవనాల్లో రోడ్లు, నీరు విద్యుత్,టెలికమ్యూనికేషన్ లాంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యా సంస్థ తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యే అందుకు అవసరమైన మరమ్మతుల పనుల స్థితిపై నివేదిక అందజేయాలని జవహర్ నవోదయ విద్యాలయం నిజాంసాగర్ ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. కాగా నవోదయ విద్యా సంస్థ మంజూరు చేయడంతో పాటు ఈ సంవత్సరం నుండి తరగతులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవడంతో పాటు తాత్కాలిక భవన మరమ్మత్తుల కొరకు తన యొక్క ఎంపీ నిధుల ద్వారా 20 లక్షలు మంజూరు చేశారు.

# ధాన్యం సేకరణలో ఇందూరు భేష్.



**ఉమ్మడి జిల్లా సమీక్షలో జిల్లా ఇంచార్జి మంత్రి కితాబు.**

**భూభారతి, రాజీవ్ యువ వికాసం, ఖరీఫ్ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం**

**పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు**

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 29

యాసంగి -2025 సీజన్ లో వరి ధాన్యం సేకరణతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో నిజామాబాద్ జిల్లా ముందంజలో నిలువడం అభినందనీయమని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల పనితీరు ఎంతో భేషుగ్గా ఉందని ప్రశంసించారు. గురువారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులతో నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి ఇంచార్జి మంత్రి జూపల్లి కీలక అంశాలపై సుదీర్ఘ సమీక్ష జరిపారు. యాసంగిలో వరి ధాన్యం సేకరణ, త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ కు సన్నద్ధత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూభారతి అమలు తీరు, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలతో పాటు తాగునీరు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. శాసన సభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి, మదన్ మోహన్ రావు, ధన్పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అన్ని శాఖలకు చెందిన ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షలో పాల్గొన్నారు.

# రూ.17 లక్షలు పోగొట్టుకున్నారు..



**విజయవాడ:** ఓ వృద్ధుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి రూ.17 లక్షలు పోగొట్టుకున్నారు. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులమని చెప్పి, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని బెదిరించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వీడియో కాల్ చేసి, బ్యాంకు ఖాతాలోని డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి చేయడంతో ఆయన పంపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఓ పెద్దాయన ఏకంగా రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్నారు.. మోసాలు జరుగుతున్నాయని పోలీసులు పదే, పదే చెబుతున్నా సరే అమాయకంగా నిండా మునిగారు. తీరా డబ్బులు మొత్తం పోయాక పోలీసుల్ని ఆశ్రయించారు.. విజయవాడకు సమీపంలోని పెనమలూరులో జరిగిన ఘటన కలకలం రేపింది. బాధితుడు చెబుతున్న వివరాల ప్రకారం.. పటమట అశోక్‌నగర్‌లో వల్లభనేని రాజేంద్రప్రసాద్ నివసిస్తున్నారు. ఆయనకు ఈ నెల 3వ తేదీన ఓ ఫోన్ కాల్ వచ్చింది.. గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ రావడంతో సందేహించారు. కానీ ఎవరో తెలుసుకుందామని ఆ కాల్ లిఫ్ట్ చేశారు. వెంటనే ఫోన్ చేసిన వ్యక్తి తాను ముంబై క్రైం బ్రాంచ్ పోలీసునని పరిచయం చేసుకున్నాడు.

'మీరు మీ మొబైల్ నంబర్‌ను చట్టవిరుద్ధమైన పనుల కోసం ఉపయోగిస్తున్నారంటూ బెదిరింపులకు దిగారు. ఇలా చట్టవిరుద్ధమైన పనులు చేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తాము' అంటూ వార్నింగ్ ఇచ్చారు. క్రైం బ్రాంచ్ పోలీసులమని చెప్పడంతో నిజమే అనుకుని రాజేంద్ర ప్రసాద్ భయపడ్డారు.. ఆ తర్వాత కాల్ కట్ చేశారు.

ఈ నెల 4న మరోసారి రాజేంద్రప్రసాద్‌కు ఫోన్ కాల్ వచ్చింది.. చట్ట విరుద్ధమైన పనులు చేసినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మరోసారి బెదిరించారు. మళ్లీ ఈ నెల 5న ఏకంగా వీడియో కాల్ చేశారు.. అప్పుడు అసలు కథ మొదలైంది. వీడియా కాల్‌లో ఒక వ్యక్తి జడ్జిగా కనిపించారు.. 'వారం పాటూ నిన్ను (రాజేంద్ర ప్రసాద్‌ను) డిజిటల్ అరెస్టు చేస్తున్నాము.. మా కస్టడీలో ఉండాలి' అంటూ బిల్డప్ ఇచ్చారు. ఒకవేళ ఈ కేసు నుంచి బయటపడాలంటే ఒక మార్గం ఉందని చెప్పారు. బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బుల్ని ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి చేశారు.. వినకపోవడంతో బెదిరించారు.

ఈ కేసు నిజమే అనుకున్న రాజేంద్రప్రసాద్ వెంటనే కానూరు కెనరా బ్యాంకుకు వెళ్లారు. తన భార్య పేరు మీద ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ రద్దు చేసి మరీ రూ.17 లక్షల్ని ఆర్‌టీజీఎస్ ద్వారా ఆ కేటుగాళ్లు చెప్పిన అకౌంట్‌కు పంపించారు. రెండు రోజుల తర్వాత కానీ రాజేంద్రప్రసాద్‌కు తాను మోసపోయినట్లు అర్థం కాలేదు.. ఆ తర్వాత పరువు పోతుందనో, అవగాహన లేకో పోలీసుల్ని ఆశ్రయించలేదు. తాజాగా బుధవారం (మే 28న) రోజు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మోసంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కాంగ్రెస్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.**

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 29:



నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సమీక్షా సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జరుగగా, అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ కీలక అంశాలను లేవనెత్తారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గతంలో ఎన్నోసార్లు అంశాలు తెలియజేసి నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది అన్న సామెత గుర్తుకు వస్తోంది" అని వ్యాఖ్యానించారు.ఇప్పటికే నిర్మించిన ఇళ్లలో మౌలిక వసతుల లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. వీటి అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేయాలని, అలాగే కొత్త ఇళ్ల కేటాయింపులో వేగం తేవాలని కోరారు. అనేక పేద కుటుంబాలు ఇళ్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయన్నారు. మిగిలిన 2750 ఇళ్లకు ప్రభుత్వం స్థలాన్ని చూపిస్తూ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరానికి నిధులు విడుదల కాలేదని, కనీసం ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలోపు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నాగారం ఇంటిగ్రేటెడ్ పాఠశాల పై అసెంబ్లీలో స్వయంగా విషయాన్ని లేవనెత్తినట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ మంత్రికి లేఖను అందజేశారని, త్వరితంగా పాఠశాల మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించాలని కోరారు. ఈ విజ్ఞప్తులను సాధారణ అభ్యర్థనగా కాకుండా ప్రజల ఆశల ప్రతిరూపంగా తీసుకొని, తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ధన్ పాల్ కోరారు.